

పుల్వామా ఉగ్రదాడి (ఫైల్)

# 11 ఏండ్లు.. 11 ఉగ్రదాడులు

- మోదీ ప్రభుత్వ పాలనలో కశ్మీరం కల్లోలితమే
- ఉగ్రవాదాన్ని అంతం చేశామన్నది ఉత్తముచ్చటే
- దాడుల్లో 147 మంది సైనికులు, పౌరులు మృతి

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): బీజేపీ ప్రభుత్వ హయాంలో ఉగ్రదాడులు తగ్గాయని, ముష్కర మూకలకు మోదీ ప్రభుత్వం ముకుతాడు వేసిందంటూ ప్రచారం జరుగుతున్నది. తమ హయాంలో ఉగ్రవాదాన్ని అంతమొందించామంటూ అధికార పార్టీ నేతలు ప్రగల్భాలు పలికారు కూడా. అయితే, వాస్తవ పరిస్థితులను విశ్లేషిస్తే ఇదంతా ఉత్త ముచ్చటగానే తెలుస్తున్నది. 2014లో మోదీ నేతృత్వంలో బీజేపీ సర్కారు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గత పదకొండేండ్లలో ఒక్క జమ్ముకశ్మీర్‌లోనే 11 ఉగ్రదాడులు జరిగాయి. 103 మంది సైనికులు, 44 మంది పౌరులు మృతి చెందారు. 213 మంది గాయాలపాలయ్యారు.

**2014 డిసెంబర్-2025 ఏప్రిల్ మధ్య కశ్మీర్‌లో జరిగిన ప్రధాన ఉగ్రదాడులు**

- **దాడి:** కశ్మీర్ లోయ దాడులు
**ఎప్పుడు:** డిసెంబర్, 2014, కశ్మీర్ లోయ, ఉరి, బారాముల్లా జిల్లా.
**ఏమైంది:** ఆర్మీ క్యాంప్‌పై దాడి చేసిన ఉగ్రవాదులు
**నష్టం:** అమరులైన 17 మంది సైనికులు
- **దాడి:** పఠాన్‌కోట్ దాడులు
**ఎప్పుడు:** జనవరి, 2016. పఠాన్‌కోట్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్
**ఏమైంది:** ఎయిర్‌బేస్ స్టేషన్‌పై దాడికి తెగబడ్డ జైషే మొహమ్మద్ ఉగ్రవాదులు
**నష్టం:** అమరులైన 8 మంది సైనికులు, ఒక పౌరుడి మరణం.
- **దాడి:** పాంపోర్ దాడులు
**ఎప్పుడు:** జూన్, 2016, పాంపోర్, పుల్వామా జిల్లా
**ఏమైంది:** సీఆర్పీఎఫ్ కాన్వాయ్‌పై లష్కరే తొయిబా ఉగ్రవాదుల మెరుపు దాడులు
**నష్టం:** అమరులైన 8 మంది జవాన్లు
- **దాడి:** ఉరి ఎటాక్
**ఎప్పుడు:** సెప్టెంబర్, 2016, ఉరి, బెరాముల్లా జిల్లా
**ఏమైంది:** ఆర్మీ బ్రిగేడ్ హెడ్‌క్వార్టర్స్‌పై దాడి చేసిన జైషే మొహమ్మద్ ఉగ్రవాదులు
**నష్టం:** అమరులైన 19 మంది జవాన్లు
- **దాడి:** నాగ్రోటా ఎటాక్
**ఎప్పుడు:** నవంబర్, 2016, నాగ్రోటా, జమ్ము జిల్లా
**ఏమైంది:** ఆర్మీ క్యాంప్‌పై దాడులకు తెగబడ్డ ఉగ్రవాదులు
**నష్టం:** అమరులైన 7 మంది జవాన్లు
- **దాడి:** అమర్‌నాథ్ యాత్రపై దాడులు
**ఎప్పుడు:** జూలై, 2017, అనంత్‌నాగ్.
**ఏమైంది:** అమర్‌నాథ్ యాత్రకు వెళ్తున్న పర్యాటకుల బస్సుపై ఉగ్రదాడులు
**నష్టం:** 8 మంది పౌరుల మృతి
- **దాడి:** పుల్వామా ఎటాక్
**ఎప్పుడు:** ఫిబ్రవరి, 2019, పుల్వామా
**ఏమైంది:** సీఆర్పీఎఫ్ కాన్వాయ్‌పై జైషే మొహమ్మద్ ఉగ్రవాదుల దాడి
**నష్టం:** అమరులైన 40 మంది జవాన్లు,
- **దాడి:** రియాసీ ఎటాక్
**ఎప్పుడు:** జూన్, 2024, రియాసీ జిల్లా
**ఏమైంది:** యాత్రికులు ప్రయాణిస్తున్న బస్సుపై ఉగ్రదాడి
**నష్టం:** 9 మంది పౌరుల మృతి
- **దాడి:** దొడా ఎటాక్
**ఎప్పుడు:** జూలై, 2024, దొడా జిల్లా
**ఏమైంది:** సైనికులపై కాల్పులు
**నష్టం:** అమరులైన నలుగురు సైనికులు
- **దాడి:** పహల్గాం దాడి
**ఎప్పుడు:** ఏప్రిల్, 2025, పహల్గాం, అనంత్‌నాగ్ జిల్లా
**ఏమైంది:** పర్యాటకులపై దాడి చేసిన్థ టీఆర్ఎఫ్ ఉగ్రవాదులు
**నష్టం:** 26 మంది మృతి, 20 మందికి పైగా గాయాలు

### అప్పటి బీజేపీ ఏలుబడిలోనూ..

2014 కంటే ముందు కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు కూడా దేశంలో పలు ప్రధాన ఉగ్రదాడి ఘటనలు జరిగాయి. అక్షర్‌ధామ్ ఆలయంపై దాడి (2002), పార్లమెంట్‌పై దాడి (2001), పహల్గాం-అమర్‌నాథ్ యాత్రికులపై దాడి (2000), ఐసీ 814 విమానం హైజాక్ (1999), కార్గిల్ దాడి-యుద్ధం (1999) ఉన్నాయి.

## ఉగ్రదాడిపై ఉవ్వెత్తున నిరసన

- విదేశాల్లో పాక్ ఎంబసీల ముందు ఎన్నారైల ధర్నా
- పీక కోస్తా అంటూ లండన్‌లో పాక్ అధికారి సంజ్ఞలు



లండన్, ఏప్రిల్ 26: పహల్గాంలో ఉగ్రదాడిని నిరసిస్తూ నేపాల్, బ్రిటన్, ఆస్ట్రేలియాలోని ఎన్నారైలు, వారి మద్దతుదారులు శనివారం ధర్నాలు చేశారు. భారత దేశ జాతీయ జెండాలు, బ్యానర్లు, ప్లకార్డులను చేతపట్టి అమాయక పౌరులను పొట్టన బెట్టుకోవడంపై పాక్‌పై తీవ్రంగా మండిపడుతూ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆయా దేశాల్లోని పాక్ రాయబార కార్యాలయాల ముందు ఎన్నారైలు నిరసన తెలిపారు. లండన్‌లోని పాకిస్థాన్ హై కమిషన్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న భారత్, యూదు పౌరులను పాకిస్తాన్ ఆర్మీ సీనియర్ అధికారి తైమూర్ రాహత్ తీవ్రంగా అవమానించారు. కమిషన్ బయట ఆందోళనలో పాల్గొన్న సుమారు 500 మంది ఆందోళనకారులను ఉద్దేశించి ఎగతాళిగా పీక కోస్తా అంటూ సైగలు చేసి చిల్లరగా ప్రవర్తించారు. ఆయన చర్యలను ఢిల్లీ మంత్రి మంజీందర్ సింగ్ తీవ్రంగా ఖండిస్తూ పాకిస్థానీలు మొదట తమ పీకలను కాపాడుకోవాలని అన్నారు.

# కరెంట్ ఇవ్వలేనోళ్లు కయ్యానికి సిద్ధమా?!

- పాకిస్థాన్ ప్రభుత్వ దుర్బలత్వంపై ఆ దేశ పౌరులు, నెటిజన్ల సెటైర్లు
- భారత్‌తో యుద్ధం చేయాల్సివస్తే పోటీ పడలేమని మీమ్స్, ట్రోల్స్



ఇస్లామాబాద్, ఏప్రిల్ 26: పహల్గాం ఉగ్రదాడిపై తమపై భారత్ చేసిన ఆరోపణలను ఖండిస్తూ, ఆంక్షలను దీటుగా ఎదుర్కొంటామని, యుద్ధమంటూ వస్తే సత్తా చాటుతామని, ఒక పక్క పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ మేకపోతు గాంభీర్య ప్రకటనలు చేస్తుండగా, మరోపక్క సాక్షాత్తు ఆ దేశ పౌరులే 'లేవలేని శూరా.. పొల్లు మాటలపరా' అంటూ పాకిస్థాన్ ప్రభుత్వాన్ని ట్రోల్ చేస్తూ జోక్‌లు వేస్తున్నారు. భారత దేశం ముందు పాక్ ఏమాత్రం నిలబడుతుంది అంటూ వారు ట్రోల్స్, మీమ్స్ విసురుతున్నారు. పలు విషయాలలో ఆ దేశ దుర్బరత్వంపై వారు ప్రభుత్వాన్ని నిలదీయడమే కాక, పహల్గాం దాడికి జవాబుదారీతనం కోరుతున్నారు. ప్రభుత్వ చర్యలతో విసుగెత్తిపోయిన పలువురు మీమ్స్, సెటైర్లతో సోషల్ మీడియాను ముంచెత్తుతున్నారు.

**గ్యాస్ ఆగి పోతుంది..**
**9 గంటల్లోపే యుద్ధం ముగించాలి!**

'భారత్ కనుక పాకిస్థాన్‌పై యుద్ధం చేయాలనుకుంటే దానిని రాత్రి తొమ్మిది గంటల ముందే ముగించాలి. కారణమేంటంటే తొమ్మిది దాటితే గ్యాస్ సరఫరా నిలిచిపోతుంది' అని ఒక పాక్ నెటిజన్ పేర్కొన్నారు. పాకిస్థాన్ వైమానిక దళాన్ని ట్రోల్ చేస్తూ ఒక ప్రసిద్ధ మీమ్‌ను షేర్ చేశాడు. ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌కు సంబంధించిన వీడియోలను పోస్ట్ చేస్తూ పహల్గామ్ దాడిపై చర్య తీసుకోవాలని కోరిన ఒక భారతీయుని పోస్టుకు బదులుగా ఒక ఫైటర్ జెట్ లాంటి నిర్మాణం కలిగిన ఒక మోటార్ సైకిల్‌ను నడుపుతున్న వ్యక్తిని చూపించే మీమ్‌ను షేర్ చేశాడు. ఆ మోటార్ సైకిల్‌ను కార్డు బోర్డుతో తయారు చేశారు. ప్రస్తుతం పాకిస్థానీలు జీవిస్తున్న దుర్భర పరిస్థితిని ఉద్దేశించి కొందరి సంభాషణను ప్రస్తావించాడు. 'భారత దేశం పాకిస్థాన్‌పై బాంబు దాడి చేయబోతుందా?' అని ఒక వినియోగదారుడు అడగడంతో సంభాషణ ప్రారంభం అవుతుంది. దీనికి ఒకరు 'భారతీయులు తెలివితక్కువ వారు కాదు' అని సమాధానం చెబుతారు. ఈ దుఃఖం బాంబు దాడి కన్నా కష్టమేమీ కాదు.. ఇది ఎప్పుడు ముగుస్తుంది బ్రో అని మూడో వ్యక్తి ప్రశ్నిస్తాడు. పాకిస్థాన్‌కు నీటి ఇబ్బందులు కలిగించడానికి సింధూ జలాలను నిలిపివేస్తామంటూ భారత్ చేసిన ప్రకటనపై ఒక పౌరుడు స్పందిస్తూ పాకిస్థాన్ ఇప్పటికే నీటి సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్నదని తెలిపాడు. నీరు ఆపుతారా? మాకు ఇప్పటికే తీవ్ర కొరత ఉంది.. మమ్మల్ని చంపుతారా? మా పాకిస్థాన్ ప్రభుత్వం ఇప్పటికే మమ్మల్ని హతమార్చింది.. లాహోర్‌ను ఆక్రమిస్తారా? అరగంటలోనే దానిని వెనక్కి ఇవ్వడం ఖాయం. అని కొందరు పాకిస్థాన్ నెటిజన్లు తమ దేశంలోని వాస్తవ పరిస్థితిపై సామాజిక మాధ్యమాల్లో స్పందించారు.

# పాక్ మళ్లీ కవ్వింపులు

**నియంత్రణ రేఖ వెంబడి అర్ధరాత్రి కాల్పులు ▪ మిషన్ రెడీ.. దేనికీ భయపడం: భారత ఆర్మీ**



న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: పహల్గాం ఉగ్రదాడితో భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరుకున్న వేళ..సరిహద్దుల్లో ఉద్రిక్తత కొనసాగుతున్నది. దాయాది సైన్యం వరుసగా రెండో రోజు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి కవ్వింపులకు పాల్పడింది. నియంత్రణ రేఖ వెంబడి పలు ప్రాంతాల్లో కాల్పులు జరిపింది. దీన్ని భారత సైన్యం సమర్థంగా తిప్పికొట్టింది. ఏప్రిల్ 25-26 అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకున్నట్టు రక్షణ శాఖ అధికారులు శనివారం వెల్లడించారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం సంభవించలేదని, ఎవరికీ గాయాలు కాలేదని వెల్లడించారు. మరోవైపు పహల్గాం ఉగ్రదాడికి భారత్ ప్రతీకారం తీర్చుకునేందుకు సిద్ధమవుతున్నట్టు కనిపిస్తున్నది. మిషన్ రెడీ..అంటూ శనివారం ఓ వీడియోను 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. 'ఎప్పుడైనా, ఎలాగైనా, దేనికీ భయపడం. ఏదీ మమ్మల్ని ఆపదు. ఎల్లప్పుడు సిద్ధంగానే' అంటూ జవాన్ల విన్యాసాలను ఆ వీడియోలో చూపించింది.

**సింధూలో నీళ్లు పారకపోతే మీ రక్తం పారుతుంది... బిలావల్ హెచ్చరిక**

పహల్గాం ఉగ్రదాడికి ప్రతి చర్యగా సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేయాలన్న భారత్ నిర్ణయంపై పాకిస్థాన్ మాజీ విదేశాంగ మంత్రి, పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ(పీపీపీ) చైర్మన్ బిలావల్ భుట్టో జర్దారీ శుక్రవారం తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. సింధూ నది తమ సొంతమని, అది ఎప్పటికీ తమదేనని సింధ్ ప్రావిన్సులోని సుక్కూర్‌లో ఓ బహిరంగ సభలో ప్రసంగిస్తూ ఆయన ప్రకటించారు. 'అందులో(సింధూ నదిలో) మా నీళ్లయినా పారుతాయి లేక మీ(భారత్) రక్తమైనా పారుతుంది' అంటూ ఆయన భారత్‌ను హెచ్చరించారు. పాకిస్థాన్‌పై భారత్ దౌత్యపరమైన ఆంక్షలు విధించిన నేపథ్యంలో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, భుట్టో జర్దారీ మధ్య అత్యవసర సమావేశం జరిగింది.


**నీళ్లు ఎక్కడైనా ఉంటే దూకండి**

పీపీపీ చైర్మన్ బిలావల్ భుట్టో జర్దారీ హెచ్చరికలపై కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీ శనివారం తీవ్రంగా స్పందించారు. ఆయన(జర్దారీ) ప్రకటన విన్నానని, నీళ్లు ఎక్కడైనా ఉంటే దూకమని ఆయనకు చెప్పండి అంటూ పూరీ విలేకరుల వద్ద వ్యాఖ్యానించారు. 'అయినా నీళ్లే లేకపోతే ఎక్కడ దూకుతాడు?అటువంటి ప్రకటనలు హుందాగా ఉండవు. ఆ విషయాన్ని వాళ్లు కూడా అర్థం చేసుకోవాలి' అని ఆయన హితవు చెప్పారు.

### 'పహల్గాం'పై తటస్థ దర్యాప్తునకు సిద్ధం

**పాకిస్థాన్ ప్రధాని షహబాజ్**

ఇస్లామాబాద్: పహల్గాంలో ఈ నెల 22న జరిగిన ఉగ్రవాద దాడిపై తటస్థ, పారదర్శక దర్యాప్తులో పాలుపంచుకునేందుకు సిద్ధంగా ఉన్నామని పాకిస్థాన్ ప్రధాన మంత్రి షహబాజ్ షరీఫ్ శనివారం వెల్లడించారు. 'నమ్మదగిన' దర్యాప్తులో భాగస్వామి కావడానికి పాకిస్థాన్ సిద్ధంగా ఉందన్నారు. నిరంతర నిందారోపణల క్రీడకు మరో ఉదాహరణ ఇటీవలి పహల్గాం విషాదంపై జరుగుతున్న ప్రచారమని చెప్పారు. ఇది ఇక ఇక్కడితో ఆగాలన్నారు. అన్ని రూపాల్లోని ఉగ్రవాదాన్ని పాకిస్థాన్ ఖండిస్తూనే ఉందన్నారు. పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మాట్లాడుతూ, అంతర్జాతీయ దర్యాప్తు అధికారులు నిర్వహించే దర్యాప్తునకు సహకరించేందుకు తమ దేశం సిద్ధంగా ఉందని శుక్రవారం చెప్పారు.



### పహల్గాం దాడి చాలా చెత్త పని

**డొనాల్డ్ ట్రంప్**

వాషింగ్టన్: పహల్గాం దాడి చాలా చెత్త పని అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఆయన శనివారం రోమ్ వెళ్తూ ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో విలేకర్లతో మాట్లాడారు. కశ్మీర్ సమస్య వెయ్యి సంవత్సరాల నుంచి కొనసాగుతున్నదని అన్నారు. ఇరు దేశాల నేతలు తనకు సన్నిహితులేనని, కశ్మీర్, ఉగ్రవాద సమస్యను ఏదోలా వారే పరిష్కరించుకుంటారని చెప్పారు.

**సూత్రధారులపై చర్యలు తప్పనిసరి**

పహల్గాంలో ఈ నెల 22న జరిగిన ఉగ్రవాద దాడిని ఐక్య రాజ్య సమితి భద్రతా మండలి తీవ్రంగా ఖండించింది. ఈ గర్హనీయ ఉగ్రవాద చర్యకు పాల్పడినవారిని, ఆర్గనైజర్లు, స్పాన్సర్లను చట్ట ప్రకారం శిక్షించాలని చెప్పింది.

## విద్యార్థిగా వెళ్లి ఉగ్రవాదిగా వచ్చాడు

***పహల్గాం దాడి నిందితుడు ఆదిల్ వివరాలు వెలుగులోకి***

*న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో ఈ నెల 22న 26 మంది పర్యాటకులను బలిగొన్న పాశవిక దాడి ఘటనలో పాల్గొన్న ఉగ్రవాదులలో ఒకడైన ఆదిల్ అహ్మద్ థోకర్ 2018లో చదువుకోవడానికి పాకిస్థాన్‌కు వెళ్లి ఆరేండ్ల తర్వాత మరో ముగ్గురు, నలుగురు ఉగ్రవాదులతో కలిసి కశ్మీర్‌కు తిరిగి వచ్చినట్టు తెలిసింది. 2018లో ఆదిల్ అహ్మద్ స్టూడెంట్ వీసాపై పాకిస్థాన్‌కు వెళ్లాడు. పాకిస్థాన్‌లో అడుగుపెట్టిన మరుక్షణం అతను తన కుటుంబంతో పాటు బాహ్య ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా తెంపేసుకున్నాడు. పాక్‌లో ఉగ్రవాద శిక్షణ తీసుకున్నాక 2024 చివరిలో అతడు భారత్‌లోకి తిరిగి ప్రవేశించాడు. అప్పటి నుంచి తన ఉనికిని రహస్యంగా ఉంచాడు. అనేక వారాల పాటు అండర్ గ్రౌండ్‌లోనే దాక్కున్న అదిల్ పాత పరిచయస్థులైన ఉగ్రవాద స్లీపర్ సెల్స్‌తో మళ్లీ సంబంధాలు ఏర్పరుచుకొని ఉంటాడని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. ఈ సమయంలోనే వార్షిక అమర్‌నాథ్ యాత్ర కోసం మళ్లీ పర్యాటక ప్రదేశాలు తెరుచుకోవడం మార్చిలో ప్రారంభమైంది. గతంలో భద్రతా కారణాల రీత్యా మూసివేసిన బైసరన్ లోయ కూడా పర్యాటకుల సందర్శనార్థం తెరుచుకుంది. ఇదే అవకాశంగా భావించిన ఆదిల్ అహ్మద్ ఏప్రిల్ 22న ఇతర ఉగ్రవాదులతో కలిసి దట్టమైన అడవుల ద్వారా బైసరన్‌లోకి ప్రవేశించి పర్యాటకులపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపాడు.*



**ఉగ్రవాదుల ఇండ్లు, రహస్య స్థావరం ధ్వంసం**

ఉగ్ర మూకలను పట్టుకునేందుకు భారత భద్రతా దళాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. ఇందులో భాగంగా కశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో ఉగ్రవాదుల రహస్య స్థావరాన్ని భద్రతా దళాలు గుర్తించి..ధ్వంసం చేసినట్టు అధికారులు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే వారి స్థావరాల నుంచి భారీగా ఆయుధాలు, మందుగుండును స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. మరోవైపు శ్రీనగర్‌లోని ఉగ్రవాదుల సానుభూతిపరుల ఇండ్లల్లో పోలీసులు సోదాలు చేశారు. ఈ క్రమంలో శుక్రవారం ఐదుగురు ఉగ్రవాదుల నివాసాలను సైన్యం పేల్చేసింది. చోటిపొరాలో ఎల్ఈటీ కమాండర్ షాహిద్ అహ్మద్ నివాసం సహా పలువురు ఉగ్రవాదుల ఇండ్లను సైన్యం బాంబులతో కూల్చేసింది.

### పహల్గాం దాడి మా పని కాదు

**మాట మార్చిన టీఆర్ఎఫ్**

పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడి విషయంలో ది రెసిస్టెన్స్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) ఉగ్రవాద సంస్థ శనివారం పూర్తిగా యూ-టర్న్ తీసుకుంది. తామే ఈ దాడి చేశామని మొదట్లో ప్రకటించిన ఈ సంస్థ ఇప్పుడు ఇది తమ పని కాదని చెప్తున్నది. అక్కడితో ఆగకుండా భారత్‌పై విపరీతమైన ఆరోపణలు చేసింది. ''మా వ్యవస్థలను భారత్ హ్యాక్ చేసి, ఆ మెసేజ్‌ను పోస్ట్ చేసింది. ఇది భారత దేశ సైబర్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్‌ల పని. దీనిపై మేము పూర్తిగా దర్యాప్తు చేస్తున్నాం.'' అని టీఆర్ఎఫ్ తెలిపింది.

### మానస సరోవర్ యాత్ర జూన్ నుంచి

**ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ**

న్యూఢిల్లీ: అత్యంత పవిత్రమైన కైలాస మానస సరోవర యాత్ర జూన్ నుంచి ఆగస్టు వరకు జరుగుతుందని విదేశాంగ శాఖ ప్రకటించింది. భక్తులను బృందాల వారీగా పంపించనున్నట్లు తెలిపింది. ఒక్కొక్క బృందంలో 50 మంది భక్తులు ఉంటారని, ఉత్తరాఖండ్ నుంచి లిపులేఖ్ కనుమ మీదుగా 5 బృందాలు, సిక్కిం నుంచి నాథులా కనుమ మీదుగా 10 బృందాలు వెళ్తాయని చెప్పింది. భక్తులు kmy.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపింది. యాత్రలో భక్తులు తమ ప్రయాణ, వసతి, ఆహార సదుపాయాల కోసం రూ.56 వేలను చెల్లించాలి. వైద్య పరీక్షలు, చైనా వీసా, పోర్టర్, టిబెట్ అటానమస్ రీజియన్, చైనా బోర్డర్ రుసుములను ప్రత్యేకంగా చెల్లించాలి. ప్రతి బృందం మొత్తం 22 రోజులు యాత్రలో గడుపుతుంది.



**ప్రముఖ చరిత్రకారుడు**

### నారాయణన్ కన్నుమూత

తిరువనంతపురం: ప్రముఖ చరిత్రకారుడు, విద్యావేత్త, భారత చారిత్రక పరిశోధన మండలి(ఐసీహెచ్ఆర్) మాజీ చైర్మన్ ఎంజీఎస్ నారాయణన్ (93) వృద్ధాప్య సమస్యలతో శనివారం కోజికోడ్‌లో కన్నుమూశారు. దేశంలోని ప్రముఖ చరిత్రకారులలో ఒకరైన ఆయన కాలికట్ యూనివర్సిటీలోని చరిత్ర విభాగాధిపతిగా 1976 నుంచి 1990 వరకు, ఐసీహెచ్ఆర్ చైర్మన్‌గా 2001 నుంచి 2003 వరకు పనిచేశారు. మలయాళం, ఇంగ్లీష్, తమిళం, సంస్కృత భాషలలో నిష్ణాతులైన ఆయన బ్రాహ్మీ, వట్టెళుతు, గ్రంథ లిపులలో కూడా ప్రావీణ్యం సంపాదించారు. చారిత్రక పరిశోధకుడిగానే కాకుండా కవిగా, సాహితీ విమర్శకుడిగా, రాజకీయ పరిశీలకుడిగా, విమర్శకుడిగా, సామాజిక కార్యకర్తగా భిన్న రంగాలలో విశేష సేవలందించారు.

### భారత్‌లో తగ్గిన పేదరికం

- పదేండ్లలో 17.1 కోట్ల మంది కడు బీదరికం నుంచి బయటకు
- ప్రపంచ బ్యాంకు నివేదిక

న్యూయార్క్: భారత్‌లో పేదరికం తగ్గినట్లు ప్రపంచ బ్యాంకు నివేదిక వెల్లడించింది. 2011-12 నుంచి 2022-23 మధ్య కాలంలో 17.1 కోట్ల మంది కడు పేదరికం నుంచి బయటపడినట్లు తెలిపింది. రోజుకు రూ.183 కన్నా తక్కువ సంపాదించేవారు 2011-12లో 16.2 శాతం మంది ఉండేవారని, 2022-23 నాటికి వీరు 2.3 శాతానికి తగ్గిపోయారని చెప్పింది. 'పావర్టీ అండ్ ఈక్విటీ బ్రీఫ్ ఆన్ ఇండియా' నివేదికలో ఈ వివరాలను తెలిపింది. గ్రామీణ కడు పేదరికం 18.4 శాతం నుంచి 2.8 శాతానికి తగ్గిందని, పట్టణాల్లో 10.7 శాతం నుంచి 1.1 శాతానికి తగ్గిందని వివరించింది. భారత్ దిగువ మధ్య ఆదాయ వర్గంలోకి మారిందని పేర్కొన్నది.

### వీసాల రద్దుపై యూ టర్న్

**ఉత్తర్వులు వెనక్కి తీసుకున్న ట్రంప్**

న్యూయార్క్, ఏప్రిల్ 26: కొండంత రాగం తీసి లల్లాయి పాట పాడిన చందంగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి యూ టర్న్ తీసుకున్నారు. ఉల్లంఘనల పేరిట అంతర్జాతీయ విద్యార్థుల వీసాలను రద్దు చేస్తూ, వారికి దేశ బహిష్కరణ విధిస్తూ బెదరగొట్టిన ట్రంప్ ప్రభుత్వం వెనక్కి తగ్గి వారికి శుభవార్త చెప్పింది. విద్యార్థుల చట్టబద్ధ హోదాను తాత్కాలికంగా పునరుద్ధరిస్తున్నామని, కొత్తగా వీసాల రద్దును చేపట్టమని హామీనిచ్చింది. ట్రంప్ ప్రభుత్వం ఇప్పటివరకు 187 కాలేజీలు, విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలకు చెందిన 1200 మందిపై వేటు వేసింది. తమ బహిష్కరణను సవాల్ చేస్తూ ఇప్పటికే పలువురు అంతర్జాతీయ విద్యార్థులు దేశంలోని వివిధ ప్రాంతాల్లో కోర్టులను ఆశ్రయించారు.



## సాదాసీదాగా పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు

***ద్రౌపదీ ముర్ము, ట్రంప్ సహా 2 లక్షల మంది హాజరు***

*వాటికన్, ఏప్రిల్ 26: పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలు శనివారం వాటికన్ సిటీలో సాదాసీదాగా ముగిశాయి. చెక్కతో చేసిన శవపేటికలో ఉంచిన పోప్ భౌతిక కాయాన్ని ఖైదీలు, వలసదారులు ఖననం చేశారు. అత్యంత సీనియర్ కార్డినల్స్ సమక్షంలో సెయింట్ మేరీ బాసిలికా చర్చి ఆవరణలో పోప్‌ను ఖననం చేసినట్టు వాటికన్ వర్గాలు తెలిపాయి. అంత్యక్రియలకు ముందు పోప్ దేహంపై తెల్లటి వస్త్రాన్ని, నాణేలు ఉన్న సంచిని, ఆయన పోప్‌గా ఉన్నప్పటి రికార్డ్ (రోజిటో)ను శవపేటిక లోపల పెట్టారు. పోప్ అంతిమ సంస్కారాల్లో పలువురు ప్రపంచ దేశాధినేతలు సహా రెండు లక్షల మంది ప్రజలు పాల్గొని ఆయనకు నివాళులు అర్పించారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్, బ్రిటన్ ప్రధాని స్టార్మర్ పోప్‌కు శ్రద్ధాంజలి ఘటించారు.*



### ఇరాన్ పోర్టులో భారీ పేలుళ్లు

***ఐదుగురి మృతి***

*టెహ్రాన్: ఇరాన్‌లోని అత్యాధునిక షాహిద్ రజాయీ నౌకాశ్రయంలో శనివారం భారీ పేలుళ్లు సంభవించాయి. ఈ సంఘటనలో ఐదుగురు మరణించగా, సుమారు 700 మందికి పైగా గాయపడ్డారు. పేలుడు వల్ల పెద్ద ఎత్తున చెలరేగిన మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది శ్రమిస్తున్నారు. ఘటన జరిగిన పరిసరాల్లో దట్టమైన పొగ వ్యాపించింది. సహాయ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు నాలుగు ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్స్‌ను పంపించినట్లు హెర్మోజ్గాన్ రెడ్ క్రెసెంట్ సొసైటీ చీఫ్ మొక్తార్ సలాహ్‌షౌర్ చెప్పారు. చాలా కంటెయినర్లు పేలడం వల్ల ఈ దుర్ఘటన జరిగిందని హార్మోజ్గాన్ ప్రావిన్స్ క్రైసిస్ మేనేజ్‌మెంట్ అథారిటీ చీఫ్ మెహ్రదద్ హస్సన్ జడేహ్ చెప్పారు. గాయపడిన వారిని సమీపంలోని దవాఖానలకు తరలించినట్లు తెలిపారు.*



### హక్కుల గురించి ప్రతి పౌరుడు తెలుసుకోవాలి

***సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ గవాయ్***

*న్యూఢిల్లీ: రాజ్యాంగ, చట్టబద్ధ హక్కుల గురించి తెలుసుకోవడం ప్రతి పౌరునికి చాలా ముఖ్యమని, వారి హక్కుల గురించి వారికి అవగాహన కల్పించకుంటే వాటిని అమలు చేయమని ఒత్తిడి చేయడానికి ముందుకు రారని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ అన్నారు. గుజరాత్‌లో జరిగిన నల్సా మూడు దశాబ్దాల వేడుకలో ఆయన శనివారం ప్రసంగించారు. ప్రతి పౌరుడికి న్యాయం, ప్రతి పౌరుడికి ఉచిత న్యాయ సహాయం కోసం నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) ప్రయత్నాలు చేస్తున్నదని నల్సా ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కూడా అయిన గవాయ్ పేర్కొన్నారు. పౌరులకు చట్టబద్ధంగా, రాజ్యాంగపరంగా లభించిన హక్కుల గురించి వారు తప్పనిసరిగా తెలుసుకోవాలని అన్నారు. మారుమూల ప్రాంతాలకు సేవలందించాలన్న నల్సా లక్ష్యాన్ని నెరవేరుస్తున్నామని అన్నారు.*

## తెలంగాణలో 230 మంది పాక్ పౌరులు

హైదరాబాద్, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో 230 మంది పాక్ పౌరులు ఉన్నారని, వారిలో 199 మంది లాంగ్ టర్మ్ వీసాలు కలిగి ఉన్నారని డీజీపీ జితేందర్ తెలిపారు. షార్ట్ టర్మ్ వీసాలు పొందిన 31 మందిని గుర్తిస్తున్నామని చెప్పారు. 'లీవ్ ఇండియా' పేరుతో జరుగుతున్న కార్యక్రమంలో భాగంగా కొంతమందికి నోటీసులు ఇచ్చామని పేర్కొన్నారు.



**మహారాష్ట్రలో 5 వేల మంది పాకిస్థానీలు**

మహారాష్ట్రలో దాదాపు 5 వేల మంది పాకిస్థానీలు నివసిస్తున్నారని, వీరిలో స్వల్పకాలిక వీసాలు ఉన్న 1,000 మందిని కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దేశం విడిచి వెళ్లవలసిందిగా ఆదేశించామని ఆ రాష్ట్ర మంత్రి యోగేష్ తెలిపారు. కొందరు 8-10 సంవత్సరాల నుంచి ఇక్కడే నివసిస్తున్నారని, కొందరు ఇక్కడే పెళ్లి చేసుకుని స్థిరపడగా మరి కొందరు పాకిస్థాన్ పాస్‌పోర్టును ప్రభుత్వానికి అప్పగించి, భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్నారని మంత్రి చెప్పారు.

**గుజరాత్‌లో బంగ్లా వలసదారుల అరెస్టు**

గుజరాత్‌లోని అహ్మదాబాద్, సూరత్‌లో నిర్వహించిన దాడులలో మహిళలు, పిల్లలు సహా వెయ్యి మందికిపైగా బంగ్లాదేశ్ అక్రమ వలసదారులను పోలీసులు నిర్బంధించారు.

**డ్రగ్స్ కేసుల్లో శిక్షలు పడేలా చూడండి: డీజీపీ**

డ్రగ్స్ కేసుల్లో నేరస్తులకు శిక్షపడేలా చూడాలని తెలంగాణ డీజీపీ జితేందర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. డీజీపీ కార్యాలయంలో శనివారం తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో డ్రగ్స్ పట్టుకున్న అధికారులకు రివార్డులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పకడ్బందీగా దర్యాప్తు చేస్తే డ్రగ్స్ కేసుల్లోని నేరగాళ్లకు 10 నుంచి 20 ఏండ్ల జైలు శిక్ష పడుతుందని చెప్పారు. లా అండ్ ఆర్డర్ డీజీ మహేశ్ భగవత్ మాట్లాడుతూ సాంకేతిక అంశాలను దృష్టిలో పెట్టుకొని నేరస్తులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీజీ అనిల్‌కుమార్, టీజీ న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా తదితరులు మాట్లాడారు. ఎస్పీలు రూపేష్, అదనపు ఎస్పీ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.